3న మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - అమలాపురం : మున్సిపల్ కార్మికుల సమ్మె తొలుత జనవరి 6 అనుకున్నా కానీ ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహ రిస్తోందని రాష్ట్ర మునిసిపల్ జేఏసీ సమ్మెను జనవరి 3కు తెచ్చి 3వ తేదీ ఉదయం నుంచి సమ్మెలోకి. రేపటి నుంచి నిరసన కార్యక్రమాలు ఉధృతం చేయాలని రాష్ట్ర మునిసిపల్ జేఏసీ పిలుపు నిచ్చిందని యూనియాన్ నాయకుడు కె సత్తిబాబు తెలిపారు. ఏపి మునిసిపల్ వర్కు యూనియన్ సమ్మె ముందుకు వచ్చినదన్నారు జనవరి 6 అనుకున్నాము కానీ ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందని రాష్ట్ర మునిసిపల్ జేఏసీ సమ్మెను జనవరి 3కు తెచ్చి 3ఉదయం నుంచి సమ్మెలోకి. రేపటి నుంచి నిరసన కార్యక్రమాలు ఉధృతం చేయాలని రాష్ట్ర మునిసిపల్ జేఏసీ పిలుపు నిచ్చిందని తమకు కార్మికులను ఉద్దేశించి ఏఇ శాంటేషన్ మాట్లాడించారు. కార్మికుల నుంచి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు నాయకత్వం వహించారు.

భక్త జనసందోహంతో మట్టి శివలింగాలు తయారీ

విశాలాంధ్ర - జగ్గంపేట : భక్త జన సందోహంతో మట్టి శివ లింగాలు తయారీ జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగు తుంది. ఏలేరు నది తీరన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం వద్ద నిర్వహించ తలపెట్టిన మహా కుంభాభిషేకం కోసం కోటి మట్టి శివలింగాల తయారీ జరుగుతున్న విషయం విధితమే. శుక్రవారం జగ్గంపేటకు చెందిన జెవిఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు కుటుంబం మట్టి శివలింగాల తయారీలో పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మర్రిపాక, సీతానగరం, కృష్ణాపురం, మామిడాడ, కిర్లంపూడి, భూపాలపట్నం, తాళ్లూరు, ఏలేశ్వరం, లింగంపర్తి, చందుర్తి, చేబ్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి భక్తజనం పాల్గొని విగ్రహాలను తయారు చేశారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతుల నెహ్రూ పర్యవేక్షించి, వారికి మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ మణి, జ్యోతుల లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు, సునీత అనీష్ నెహ్రూ, కొత్త కొండ బాబు, ముత్యాల సత్యనారాయణ, కోడూరి సత్యనారాయణ, పల్లయ్య, జ్యోతుల సత్తిరాజు, అడపా తాతాజీ వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

పాదచారులకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు

విశాలాంధ్ర, కొవ్వూరు : వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాల్లో పాల్గొనే వారి అవసర ంలలోను పాదచారుల కు సేవ కొరకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయటం ఆనంద దాయకం అని వజ్ర వనిత వాసవి క్లబ్ అధ్యక్షులు మద్దుల వెంకట లక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వజ్ర వనిత వాసవి క్లబ్ 2023నకు క్లబ్ నాయకురాలిగా కొనసాగుతూ అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించామని ఆమె తెలిపారు. తన కార్యవర్గంలో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరికి క్లబ్ ద్వారా చిరు జ్ఞాపికలు అంద చేశారు అనంతరం కొవ్వూరు పట్టణంలో ఇందిరమ్మ కాలనీలో వజ్ర వనిత వాసవి క్లబ్ తరఫున పర్మినెంట్ ప్రాజెక్టులో భాగంగా ఒక సిమెంట్ బెంచ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగుబండి దివ్య.. కోశాధికారి గ్రంధి సంజన. వలివేటీ రామ లక్ష్మి , కక్కిరల పద్మ, కంచర్ల లక్ష్మి,, మనేపల్లి సువర్ణలక్ష్మి,, అర్య వైశ్య సంఘ అధ్యక్షులు మద్దుల సోమ రాజు, వలివెటీ ప్రసాద్, ముద్దులసత్య నారాయణ, వంకాయల శివ రామ కృష్ణ, పెరు మళ్ళ విరేశ్వర్ రావు, కొత్తమాసు వాసు, నాగు బండి గంగ రాజు పాల్గొన్నారు

అవినీతితో ఉపాధిహామీ పథకం

విశాలాంధ్ర పెరవలి : 16వ విడత సామాజిక తనికీలలో భాగంగా శుక్రవారం పెరవలి మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనికీ ప్రజావేదిక నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నతాధి కారులు పిడి ఆగదాంబ ఏపిడి అప్పలరాజు మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులవివరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తపరచారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని సిబ్బంది పనితీరు సక్రమంగా లేని కారణంగా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తపరచారు. పనుల వివరాలకు చెందిన బోర్డులను యార్పాటు చేయకుండా దానికి సంబందించి కొంత మొత్తాన్ని డ్రా చేసినట్లుగా ఆడిట్‌లో గుర్తించి ఇప్పటికే రికవరీ చేయించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో సుమారు 6 కోట్ల 46లక్షల 64వేల 550 రూపాయల పనులకు 2022 ఏప్రియల్ నుండి 2023 మార్చ్ నెల వరకు ఈతనికీలు నిర్వహించడం జరిగింది. ఉసులమర్రు అన్నవరప్పాడు గ్రామాలకు చెందిన శ్రీనివాస్ చిన్నా అనే వ్యక్తులు ఆయాగ్రామాలలో సిబ్బంది నిర్లక్ష్యం వలన వారు చేయించిన పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని ఉన్నతదికారుల దృష్టికి తీసుకురాగా వాటిని పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ ఆర్ నరేష్ యస్ ఆర్ పి తులసి నాయక్ ఎంపిడిఓ రమేష్ యం పి పి సీతారామ్ ప్రసాద్ యస్ ఆర్ ఇ జి యస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అంసూరి సూర్యనారాయణ అధ్యక్షతన ఎంపీడీవో హిమ మహేశ్వరి పర్యవేక్షణలో శుక్రవారం బడ్జెట్ సమావేశం జరిగింది. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో పలు విషయాలపై సమీక్షించి బడ్జెట్ సమావేశంలో చర్చించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించడం జరిగింది. అనంతరం ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఆరోగ్యశ్రీ కార్డులు లాంచ్ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడలో నిర్వహించనున్న అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడు కలకు కాంగ్రెస్ పార్టీ ప్రత్తి పాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సారధ్యంలోని కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిసిసి మెంబర్ ధర్నాలకోట శ్రీను, మొయ్యేటి సూర్యప్రకాశ్ రావు, కొప్పన కోటేశ్వరావు, తేజోమూర్తుల ఉషారాణి, కొల్లు వీర గణేష్, శేఖర్, పోతాబత్తుల పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మండల పరిధిలోని కర్రివాని రేవు గ్రామ పంచాయతీ సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి జగపతి చేతుల మీదుగా బూరుగుపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ ఆలయమునకు భూమి పూజ (శంకు స్థాపన) చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా పది లక్షల రూపాయలతో మరియు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సహకారంతో మంజూరు చేయబడిన నిధులతో ఆలయం నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు క్రోలా గంగాభవాని బాబ్జి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, జడ్పిటిసి సభ్యులు కూడిపూడి శంకర్రావు పాల్గొన్నారు.

జిల్లా మినరల్ ఫండ్‌తో చేపట్టిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ డా కృతికాశుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా మినరల్ ఫండ్ (డీఎఫ్ఎం)తో జిల్లాలో చేపట్టిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీఎఫ్ఎం నిధులతో కాకినాడ జిల్లాలో చేపట్టిన పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, మైన్స్, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, వ్యవసాయం, పశుసంవర్ధక, జిల్లా పరిషత్, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో డీఎఫ్ఎం నిధులతో 281 పనులను రూ. 43.955 కోట్లతో మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిలో రూ. 16.175 కోట్ల ఖర్చుతో 51 పనులు ఇప్పటివరకు పూర్తి చేయడం జరిగిందని, 103 పనులు వివిధ దశలో ఉన్నాయని ఆమె తెలిపారు. అంతర్గత రహదారులు, పశువుల ఆసుపత్రి, మంచి నీటి ట్యాంకులు, పాఠశాలలకు అదనపు తరగతులు, రోడ్లు, కల్వర్టులు, అంగన్వాడీ భవనాలు తదితర నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులన్నీటిపైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వినియోగంలోనికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పనులు పూర్తయిన మేరకు బిల్లులు సమర్పించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నేడు నిర్వహిస్తున్న ఈ నాలుగో డీఎంఎఫ్ సమావేశంలో పంపారిజర్వాయర్ గేట్లు మరమత్తులకు 4.45 లక్షలు, ప్రతిపాడు మండలంలోని శంఖవరం-వేలంగి గ్రామాల మధ్య రోడ్డు మరమ్మతులు మొత్తం రూ.100 లక్షలు, ఉత్తరకంచి-పెద్దిపాలెం గ్రామాల మధ్య రోడ్డు మరమ్మ తులకు రూ.20 లక్షలు, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పిఠాపురం బ్రాంచ్ కెనాల్ పనుల నిమిత్తం రూ. 4.99 లక్షలు, కరప మండలంలోని ఎండమూరు, సంపర, కురాడ గ్రామాల పరిధిలోని బోడి కాలువ డీసెల్టేషన్ పనులు నిమిత్తం రూ.27.81 లక్షలు కొత్తగా మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే సీతారామరావు, మైన్స్ డీడీ ఇ నరసింహ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, ఆర్ అండ్ బీ ఎస్ఈ హరిప్రసాద్ బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ బీ సత్యనారాయణ మూర్తి, పెద్దాపురం ఇరిగేషన్ డీఈ రాంగోపాల్, జెడ్పీ ఏవో ఎం బుజ్జి బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛ ప్రతి ఒక్కరి బాధ్యత

- పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు

విశాలాంధ్ర - పెద్దాపురం : పత్రికా స్వేచ్ఛ ప్రతి ఒక్కరు బాధ్యత అని, జర్నలిస్టుల సంక్షేమానికి అధికార యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందని పెద్దాపురం ఆర్డీఓ జె సీతారామారావు అన్నారు. పెద్దాపురం ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్లబ్ సభ్యులకు తపాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పోస్టల్ భీమా కార్డులు పంపిణీతో పాటు ప్రెస్ క్లబ్ (ప్రింటి మీడియా) నూతన సంవత్సరం 2024 క్యాలెండర్ ఆవిష్కరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు రాకుర్తి రాంబాబు అధ్యక్షతన జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ సభలో ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ అర్హత కల్గిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి అధికార యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. డివిజన్ పరిధిలోని పాత్రికేయులకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని ఆర్డీఓ రామారావు హామీ ఇచ్చారు. ఎంపీడీఓ. బి అశోకుమార్, ఈఓపీఆర్డి కె.రాజశేఖర్ మాట్లాడుతూ పత్రికా రంగంలో చాలా మంది పాత్రికేయులు దయనీయ పరిస్థితిలో ఉన్నారన్నారు. అటువంటి తరుణంలో కుటుంబ సభ్యులకు ఉపయోగపడే విధంగా ప్రమాద భీమా పాలసీ కల్పించేందుకు ప్రెస్ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాకుర్తి రాంబాబు, ఎస్పీఎస్ వినాయక్ మాట్లాడుతూ గతమెన్నడూ లేని విధంగా స్థానిక పాత్రికేయులకు ప్రమాద భీమా సౌకర్యానికి సహకరించిన దాతలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 2024 పెద్దాపురం ప్రెస్ క్లబ్ నూతన క్యాలెండర్ను ఆర్డీఓ, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీల చేతుల మీదుగా ఆవిష్కరించారు. తొలుత క్లబ్ సభ్యులు 14 మంది జర్నలిస్టులకు తపాల భీమా కార్డులను ఆర్డీఓ జేఎస్ రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తపాల శాఖ సిబ్బంది చదలాడ, గుడివాడ బీపీఎంలు రవి, ఎం వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు మొల్లు సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు చవ్వాకుల ఈశ్వరరావు, కోశాధికారి రాయవరపు వీరబాబు, క్లబ్ న్యాయ సలహాదారు ఎస్ శ్రీరామ్, పూర్వ, అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు బి బుజ్జిబాబు, బి కుమార్, పి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, ఎస్ కొండలరావు పాల్గొన్నారు.

ఈ కేవైసీ తిప్పలు అరుగుల మీదే పడిగాపులు

విశాలాంధ్ర - మండపేట : గత నెల రోజులుగా గ్యాస్ వినియోగ దారులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ కంపెనీల ద్వారా వినియోగదారులకు అందించే రాయితీలు, భద్రత కోసం చేపట్టిన ఈ కేవైసీ విధానం తలనొప్పిగా మారింది. ఈ ప్రక్రియ కోసం ప్రతీ వినియోగదారున్ని ఆయా గ్యాస్ ఏజెన్సీలకు పిలిపించి ఈ కేవైసీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మారేడుబాక రోడ్డు, గుమ్మిలేరు రోడ్డు, ఏడిద రోడ్లలో ఉండే ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం క్యూ కడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తుంది. సామాన్య మధ్య తరగతి ప్రజలు తమ పనులు మానుకుని రోజంతా ఏజెన్సీ అరుగుల మీదే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంటి వంట పనులు మానుకుని పిల్లా పాపల్ని సైతం బడులకు పంపడం మానేసి గ్యాస్ కంపెనీల ముందు నిరీక్షించాల్సి వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీల వద్ద ఎవరో ఒకరు మాత్రమే ఈ కేవైసీ ఆన్లైన్ చేపడుతున్నారని ఒక్కో ఈ కేవైసీకి అరగంట సుమారు పడుతుండడంతో సాయంత్రం వరకు సమయం వృథా అవుతుందని వాపోతున్నారు. తిండీ తిప్పలు మానుకుని గంటల తరబడి అక్కడే గడుపుతుంటే టైం అయ్యాక పొమ్మంటుంటే మళ్లీ మర్నాడు పనులు మానుకుని వెళ్లాల్సి వస్తుందని ఏకరవు పెడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తమ బాధలు అర్థం చేసుకుని వార్డుల్లోనే ఈ కేవైసీని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదల ఆరోగ్య భద్రతే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి
- ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : పేద ప్రజలకు కూడా పరిమితి లేని కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏకైక లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏఎంజి స్కూల్ ఆవరణలో కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆరోగ్యశ్రీ పై ప్రస్తుతం ఉన్న ఆదాయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నూతన కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్ర కళా దీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, వైయస్ఆర్సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద ప్రజలెవ్వరూ ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం బాధపడకూడదనే ఏకైక లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని ఆయన తనయుడు వైయస్ జగన్ మరింత పటిష్టవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3257 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారన్నారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ కొత్తగా అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులతో ఇతర రాష్ట్రాలలో కూడా వైద్య సేవలు పొందే వెసులుబాటు ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఎకౌంట్‌తో అనుసంధానం చేశారన్నారు. గుండె, క్యాన్సర్, కిడ్నీ సహా ముఖ్యమైన వ్యాధులకు కూడా ఈ కార్డుల ద్వారా ఏడాదికి రూ.25 లక్షల పరిమితి వరకు వైద్య సేవలు పొంద వచ్చునన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగి తిరిగి కోలుకునేంతవరకు ఆసరా పేరుతో ప్రభుత్వం ఆర్థిక చేయూత కూడా ఇస్తుందన్నారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే ద్వారంపూడి,అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్న కుమార్, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీ చరణ్ పాల్గొన్నారు.

2024లో జగన్‌ను సీఎం చేయడమే అజెండా

జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్

విశాలాంధ్ర - జగ్గంపేట : నేను ఇప్పటి వరకు ఏ పదవిని ఆశించకుండా పార్టీ స్థాపించిన నాటి నుండి పార్టీ విజయం కోసమే పని చేస్తున్నానని, అదే విధంగా 2024లో వైసిపిని గెలిపించుకోవడమే నా ప్రధాన ఎజెండా అని కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ పిలుపునిచ్చారు. జగ్గంపేట శ్రీ బాలాజీ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసిన రఘురామ్ మాట్లాడుతూ ఇటీవల గత కొన్నిరోజులుగా నియోజకవర్గ పార్టీలో జరుగు తున్న పరిణామాలపై ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంత మంది రాజీనామాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ మనుగడ లేదు అనే ప్రచారం జరుగుతుందన్నారు. వాటిని తిప్పి కొట్టాలని మేము అంతా ఉన్నాం అని నిరూపించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. 2024లో జగ్గంపేట నియోజకవర్గ సీటు ఎవరికి ఇచ్చినా గెలిపించుకోవాలని, అదే విధంగా జగన్‌ను సీఎం చేసు కోవాలన్నదే నా ఎజెండా అన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ పార్టీ విజయం కోసం కృషి చేసి గెలిపించు కోవాలన్నారు. అనంతరం 2024 ఎన్నికల్లో జగ్గంపేట సీటు ఎవ్వరికి ఇచ్చినా గెలిపిస్తాం అనే తీర్మానాన్ని సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జెడ్పీటిసి ఒమ్మి బిందుమాధవి, గండేపల్లి ఎంపిపి చలగళ్ళ దొరబాబు, కాట్రావులపల్లి సర్పంచ్ పిట్టా సుగుణరావు, రాజపూడి ఎంపిటిసి నంగన శివ నాగేంద్ర, వైసిపి నాయకులు గుడాల సామ్యూల్, అత్తులూరీ సాయిబాబు, బుర్రి చక్రబాబు, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఏ గఫూర్ పాల్గొన్నారు.

గోకవరంలో 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే

జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు

విశాలాంధ్ర - గోకవరం : జగ్గంపేట ఎమ్మెల్యే టికెట్. తనకి ఇచ్చినా ఇవ్వకపోయినా అధిష్టానం. మాట దిక్కరించేది లేదని జగ్గంపేట నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం మండల ముఖ్య కేంద్రమైన గోకవరంలోని మెయిన్ రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన కొద్దిసేపు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో రాబోయే అసెంబ్లీ. ఎన్నికలలో తనకు జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్టు ఇచ్చిన ఇవ్వకపోయినా వైఎస్ఆర్సిపి తరఫున పార్టీ గెలుపు కోసం కలిసి పని చేస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. ఎట్టి పరిస్థితులలోనూ తెలుగుదేశం పార్టీలోకి మారే ప్రసక్తే లేదని ఆయన. గంట పదంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి వీరబాబు జడ్పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ రమేష్ గోకవరం మండలం వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు పార్టీ రాంబాబు ఆసుపత్రి డైరెక్టర్లు. కర్రీ సురారెడ్డి పెనుగొండ సత్యానందం. ఏపీ ఎం ఎస్ ఐ డి సి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారామరాజు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ రత్నం రాజు ఏఈ శేషగిరిరావు. వైద్యశాఖ తరఫున డిసిహెచ్ఎస్ డాక్టర్ సనత్కుమారి. డాక్టర్ వణిజా కుమారి పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

కొవ్వూరు నుంచి హోంమంత్రి వనితకు మరోసారి పోటీకి అవకాశం?

విశాలాంధ్ర కొవ్వూరు : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం ఉన్న హోం మంత్రి తానేటి వనితను 2024 ఎన్నికల్లో కూడా కొవ్వూరు నుంచి వైకాపా తరపున బరిలో కొనసాగిస్తున్నట్లు తాడేపల్లి అధిష్టానం నుంచి సంకేతాలు అంది నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. శుక్రవారం తాడేపల్లి నుంచి విడుదల చేసిన ప్రకటనల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి కొవ్వూరు నుంచి తానేటి వనిత. తణుకు నుంచి కారుమూరి, నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం నుంచి కొట్టు సత్యనారాయణలను తిరిగి కొనసాగిస్తున్నట్లు అంది వచ్చిన సమాచారం ఇదిలా ఉండగా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్థానంలో ఆయన సతీమణికి అవకాశ లభిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి నలుగురు సిటింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించగా అమలాపురం స్థానం నుంచి పినిపే విశ్వరూప్ స్థానంలో ఆయన కుమారుడికి అవకాశం ఇస్తున్నారు. ఇదిలా ఉండగా రామచంద్రపురం నుంచి వహిస్తున్న మంత్రి చెల్లిబోయిన వేణుగోపాల కృష్ణకు స్థాన చలనం జరిగి రాజమండ్రి రూరల్ నుంచి పోటీకి దిగుతున్నట్లు అధిష్టానం నుంచి సంకేతాలు అందాయి.

అన్నదాన ట్రస్టుకు విరాళాల వెల్లువ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో వాడపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నిత్య అన్న ప్రసాదం ట్రస్టుకు భక్తులు రాయవరం మండలం చెల్లూరు వాస్తవ్యులు కంచర్ల గోపాలరావు రూ.54,000/-లు, చెన్నై వాస్తవ్యులు బి రాజగోపాల్ బాలాజీ రూ.10,116/-లు, వాడపల్లి వాస్తవ్యులు దుర్గా ప్రసాద్ రూ.16,500/-లు, తణుకు వాస్తవ్యులు యం పవన్ కుమార్ రూ.10,000/-లు విరాళంగా సమర్పించారు. వీరిని దేవస్థానం చైర్మన్ రమేష్ రాజు, ధర్మకర్త మండలి సభ్యులు, యం.సత్యనారాయణ రాజు కార్యనిర్వహణా ధికారి వారు, అర్చక స్వాములు, మన్యం భాను, సిబ్బంది స్వామి వారి చిత్రపటం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా వైఎస్ఆర్ యువజన విభాగం కార్యదర్శిగా పువ్వుల ప్రసాద్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోనీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా కార్య దర్శిగా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పువ్వుల వర ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. తన నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తానని ప్రసాద్ తెలిపారు.

సాగునీటి విడుదల

విశాలాంధ్ర - తాళ్ళపూడి: తాళ్లపూడి మండలంలో గల పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ద్వారా రెండవ పంటకు సాగు నీటి పంపిణీకి ఎత్తిపోతల పథకం అధ్యక్షులు కాకర్ల వెంకటే శ్వరరావు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ స్కీం ఆయకట్టు దాదాపు 3500 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఒక ట్రాన్సుర్‌పై రెండు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సుమారు ఐదు లక్షల రూపాయలు వ్యయంతో రెండవ ట్రాన్సఫార్మ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా రైతులు నుండి నీటి తిరువా బకాయిలున్నాయని, రైతులు సహకారం అందించి, బకాయిలు పూర్తిస్థాయిలో సకాలంలో అందిస్తే రైతులకు మరిన్ని సేవలు అందించ గలమని ఆయన పేర్కొన్నారు. కావున వెంటనే రైతులు బకాయిలు చెల్లించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైకాపా నాయకులు బండ్రెడ్డి వెంకటే శ్వరరావు, బండ్రెడ్డి సత్యనారాయణ డైరెక్టర్లు ఇంజవరపు మురళి, ఎత్తిపోతల పథకం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె 18వ రోజు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : అంగన్వాడీ కార్మికుల సహజమైన, న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషా రావు అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శేషారావు, శిబిరంలో వారితో పాటు కూర్చుని, మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ మానవత్వం లేని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం అతి త్వరలోనే చెల్లించు కోవాల్సి వస్తుందన్నారు. కొనసాగుతున్న సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్మికులు శుక్రవారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం మండలం టిడిపి అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, అంగన్వాడీలు కె లక్ష్మి కుమారి, ఎస్ రంగ నాయకమ్మ, ఎం.జానకి, కె.ఎస్.ఎస్ ప్రసన్నకుమారి, కె.విజయకుమారి, పుల్లరత్నం పాల్గొన్నారు.

ఘనంగా కంచి రాజు 16వ వర్ధంతి

విశాలాంధ్ర - కరప : కరపలో చాగంటి సత్య వరద కంచిరాజు 16వ వర్ధంతిని తెలుగుదేశం పార్టీ నాయకులు, కంచి రాజు కుటుంబ సభ్యులు చాగంటి వెంకటరావు, చాగంటి సూరిబాబు, జయలక్ష్మి, కళ్యాణ్ కుమార్, గాయత్రి ఆధ్వర్యంలో కంచి రాజు శిలా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా విశ్రాంతి ఉపాధ్యాయులు తాతారావు మాస్టర్ మాట్లాడుతూ కంచి రాజు కరప గ్రామంలో సర్పంచ్‌గా సేవలందించడమే కాక అపర భగీరథునిగా గ్రామానికి మంచి నీటిని తీసుకువచ్చి పేదల దాహార్తిని తీర్చారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్ర సర్పంచుల సమాఖ్యకు అధ్యక్షునిగా పనిచేశారని, కరప గ్రామాన్ని ఒక త్రాటిపై నడిపించారని తెలిపారు. దేవు వెంకన్న మాట్లాడుతూ కంచిరాజు సేవలు మరుగులేమని పేర్కొన్నారు. ఎంపీపీ పెంకి శ్రీలక్ష్మి సత్తిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు నక్క వీరభద్రరావు, పేపకాయల వీరబాబు, రెడ్డి వీరభద్రరావు, మాజీ సర్పంచ్ తాతీలు, భోగిరెడ్డి సూర్యనారాయణ, గొర్రెల వెంకన్న, మంచాల శ్రీనివాసరావు, నక్క నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కేంద్ర కార్యదర్శి

విశాలాంధ్ర ఏలూరు: జిల్లాలో రెండురోజులు పర్యటనకోసం విచ్చేసిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కేంద్ర కార్యదర్శి సుశీల్ బడింగ్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని గిరిజన గ్రామాల్లో గిరిజనుల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రభావాన్ని అంచనా వేయడానికి విచ్చేసిన సుశీల్ బడింగ్ కొద్దిసేపు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌తో సంభాషించారు. జిల్లాలోని గిరిజన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఆయనకు కలెక్టర్ వివరించారు. గిరిజన జనాభా సమ్మిళిత అభువృద్ధి లక్ష్యం దిశగా కేంద్ర మంత్రిత్వ శాఖ చేపట్టిన పథకాలు మరియు కార్యక్రమాల ప్రభావం, ప్రత్యేక వలనరబుల్ ట్రైబల్ గ్రూపులను కలుసుకొని వారితో మాట్లాడటం జరుగుతుందని సుశీల్ బడింగ్ చెప్పారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్టు అక్రమం

విశాలాంధ్ర కాళ్ల : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి భీమవరం పర్యటన సందర్భంగా యుటిఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం దారుణమని యుటిఎఫ్ నాయకత్వం ఖండించింది. ఎటువంటి నిరసన కార్యక్రమానికి మేము పిలుపు ఇవ్వకపోయినా ముందస్తుగా అరెస్ట్ చేయడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. విధులకు వెళ్లకుండా ఆటంకపరిచి నందుకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. బిఆర్ఎంకే స్వామి, రామకృష్ణంరాజు పట్టాభి తమ నిరసనను తెలియజేశారు.

243 మందికి నూతన పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో నూతనంగా పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన 243 మందికి నూతన సంవత్సరం జనవరి నెలలో అంద జేయడం జరుగుతుందని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు.

మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం వినియోగించుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ను ప్రజలందరూ వినియోగించుకోవాలని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. శుక్రవారం 90 లక్షల రూపాయలు విలువగల 421 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్నవారు మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం వాట్సాప్ నెంబర్9490617573 కి హాయ్ హెల్ప్ అని మెసేజ్ పెట్టి సమాచారం పంపితే చాలు మీ మొబైల్స్ ని రికవరీ చేస్తామని అన్నారు. ఇందు నిమిత్తం ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఐటీ కోర్ సిబ్బంది, సి సి ఎస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వాటిని రికవరీ చేయడం జరుగుతుందని దీనిని ప్రజలు సద్వినియోగపరచుకుని పోగొట్టుకున్న మొబైల్స్ తిరిగి పొందవచ్చు అన్నారు. అలాగే ఆటకాయతనంగా ఆకతాయిలు ఈ అప్లికేషన్ను దుర్వినియోగపరచుకుంటే సహాయం పొందవలసిన వారికి సహాయం అందించలేమని, ఎవరికైనా దొరికిన ఫోను దొంగతనం చేయలేదు కదా అని సొంతానికి ఉపయోగిస్తే తద్వారా కేసులలో ఇరుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అందువల్ల ఒకవేళ ఫోన్ దొరికితే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో అందజేయాలని అన్నారు.

కృష్ణాజిల్లా పోలీసుల పనితీరు భేషుగ్గా ఉంది : ఎస్పీ

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల సంఖ్య తగ్గిందని అలాగే రికవరీ రేటు పెరిగిందని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. శుక్రవారం 2023 సంవత్సరం నేర గణాంకాల నివేదిక సమర్పణలో భాగంగా,2022 వ సంవత్సరంలో10845 కేసులు నమోదు కాగా2023 లో 9404 కేసులు మాత్రమే నమోదు అయ్యాయని, పోలీసు వారు చేపట్టిన ముందస్తు చర్యలు, కమ్యూనిటీ పోలీసింగ్ వలన హత్య కేసులు, దోపిడీ కేసులు, కన్నపు నేరాలు, దొంగతనాలు తగ్గాయని, రికవరీ శాతం పెరిగిందని, మహిళలపై నేరాల సంఖ్య కూడా తగ్గిందని, ఫోక్సో చట్టం వల్ల, మరియు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ పై బాల బాలికలకు అవగాహన కల్పించడం, మరియు ముఖ్యంగా మొబైల్ వినియోగం వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించడం వల్ల బాలికలపై లైంగిక నేరాల సంఖ్యతగ్గిందన్నారు. గంజాయి అమ్మకందారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ముగ్గురిపై పిడి యాక్ట్ ప్రయోగించి మరికొందరిపై షీట్ ఓపెన్ చేయడం ద్వారా గంజాయి సరఫరా తగ్గిందన్నారు. రహదారులపై ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉన్నచోట హెచ్చరిక బోర్డులు,బ్లింకర్స్, రేడియం స్టిక్కర్స్ తో కూడిన డ్రమ్ములు, బారిగేట్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు జగనన్నకు చెబుదాం కార్యక్రమం లో సివిల్ కోర్టులో ఉన్న సమస్యలు తప్ప మిగిలినవన్నీ పరిష్కరించామన్నారు. 2023 సంవత్సరం నందు ఐదుసార్లు లోక్ అదాలత్ నిర్వహించగా అందులో కృష్ణా జిల్లా పోలీస్ శాఖ తరపున 34౭89 కేసులలో రాజీ జరిగిందన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమ కొరకు పోలీస్ యూనిట్ హాస్పిటల్, మహిళల విశ్రాంతి భవనం, పోలీస్ ఇన్నోవేషన్ సెంటర్, స్పందన హాలు వంటివి నిర్మించి, ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఫిర్యాదారులకు భోజన సదుపాయం ఏర్పాటు చేసి వారికి విశ్రాంతితోపాటు సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతున్నామన్నారు. ప్రమాదవశాత్తు లేదా అనారోగ్య కారణాలతో హోంగార్డు విభాగంలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 17 మందికి నియామక పత్రాలు అందజేశామన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము పర్యవేక్షణలో సరఫరా చేసిన 'స్ఫూర్తి' పుస్తకాలను పంపిణీ చేశారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్లో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి 29 మంది పిల్లలకు అందజేసి వారికి పలు సూచనలు ఇచ్చారు. హెచ్ఎం ఎస్. వెంకట శేష సాయి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జజ్జవరపు మంగమ్మ పాల్గొన్నారు. అలాగే మొవ్వ శ్రీమండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావు పర్యవేక్షణలో 168 మంది పిల్లలకు పంపిణీ చేశారు.కాగా మండలంలో భట్ల పెనుమర్రు, పెదసనగల్లు, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో, పెద ముత్తేవి సంస్కృత ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలో చదువుతున్న 432 మంది విద్యార్థులకు అందించారు.

కాపులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కాపు జేఏసీ నేతలు స్పష్టీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాపు సామాజిక వర్గానికి సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని లేని పక్షంలో జనవరి మూడో తేదీన విజయ వాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని రాష్ట్ర కాపు జేఏసీ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం కాకినాడ విద్యుత్ నగర్లోని వెంకన్న బాబు ఫంక్షన్ హాల్లో రాష్ట్ర కాపు, తెలగా, బలిజ, ఒంటరి కులాల జేఏసీ నేతలు విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ నేతలు వాసిరెడ్డి ఏసుదాసు,ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణుమూర్తి, ఆరేటి ప్రకాష్, చందు జనార్దన్, మాట్లాడుతూ సీఎం జగన్ ప్రకటించిన కాపు కార్పొరేషన్ నిధులు ఏడాదికి 2వేల కోట్ల చొప్పున 5 ఏళ్లకు 10వేల కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేసి కాపుల అభివృద్ధి, సంక్షేమంకు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించిన జీవోను కూడా అమలు చేయాలని, కులాల వారీగా కులగణన చేపట్టి రాష్ట్రంలో ఉన్న కాపు సామాజిక వర్గ వాస్తవ సంఖ్యను లెక్కించి తమకు దామాషా పద్ధతి ప్రకారం విద్యా, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడైన పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయాలని, అలాగే నూతనంగా ఏర్పడిన జిల్లాలకు కాపు ప్రముఖులు దివంగత వంగవీటి రంగా, పెరియార్ రామస్వామి, కన్నెగంటి హనుమంతు, శ్రీకృష్ణదేవరాయల పేర్లను పెట్టాలని డిమాండ్ చేశారు. కాపులను వెనకబడి వర్గాలుగా ఎఫ్ కేటగిరీలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గత ప్రభుత్వం బిల్లును అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాపు కార్పొరేషన్ బలోపేతం చేయాలని దానికి మంత్రులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. రాష్ట్రంలో అన్ని చట్టసభలో ఆయా రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కాపులకు చేయాల్సిన పనులను మాని తమలో తమకే విభేదాలు, విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను డిమాండ్లను, ప్రాతినిధ్యం కల్పించిన పార్టీలకు మద్దతు ఉంటుందని ఏసుదాసు, రామకృష్ణలు చెప్పారు. ఈ సమావేశంలో కాపు నాయకులు బసవా ప్రభాకర రావు, చిట్నీడి శ్రీనివాస్, దామిశెట్టి శ్రీను, అడబాల సత్యనారాయణ, జంక్షన్ బాబ్జి, కొప్పిశెట్టి శ్రీను, జ్యోతి వీరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

డెల్టా ప్రాంతంలో వరి గడ్డికి యమ గిరాకీ

విశాలాంధ్ర - పెనుమంట్ర: డెల్టా ప్రాంతంలో వరి గడ్డికి గిరాకీ ఏర్పడింది. అకాల వర్షాలతో పశుగ్రాసం కొరత మొదలైంది. ప్రతి ఏటా ఇదే సమస్య. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. పాడి రైతులు పశుగ్రాసం కోసం పరుగులు తీస్తున్నారు. అన్నదాతకు గట్టి ఎదురుదెబ్బ తగులుతుంది. ఆచంట నియోజకవర్గం లో వేల సంఖ్యలో పాడి పశువులను పోషిస్తున్నారు. పాడి పంటలపైనే ఆధారపడి కొన్ని గ్రామాల రైతులు జీవనం సాగిస్తున్నారు. అకాల వర్షాలతో పశుగ్రాసం కొరత అధికంగా ఏర్పడింది. గేదెలను, ఆవులను పోషించుకోవడం రైతులకు తలకు మించిన భారంగా మారుతుంది. సంప్రదాయ పద్ధతిలో కొడవలితో కోసిన వరిగడ్డికి రైతులు మక్కువ చూపుతున్నారు. ఈ పద్ధతిలో కోసిన వరిగడ్డి రెండు శాతానికి మించి లేకపోవడంతో గత్యంతరం లేక ముఖ్యంగా డెల్టా ప్రాంతంలో కూలీల కొరత కారణంగా యాంత్రికరణ విధానంతో గత కొంత కాలంగా పశుగ్రాసం అంతంత మాత్రం గానే ఉంది. దీంతో ప్రతి ఏటా పశు గ్రాసం కొరత ఉత్పన్నమౌవుతుంది. ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో అకాలంగా కురిసిన వర్షాలతో ఒక మోపు గడ్డి కావాలి అంటే రూ. 260 నుండి రూ300 ఖర్చు పెట్టవలసిన పరిస్థితి నేడు నెలకొంది. అయినప్పటికీ కావలసిన వట్టిగడ్డి దొరకక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు వద్ద దళారీలు గడ్డిని కొని ఫ్యాక్టరీలకు అమ్మడం వల్ల గిరాకీ ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.గత 20 సంవత్సరాలుగా ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదని లక్ష రూపాయలు విలువచేసే గేదెలను 30 వేలకు అడుగుతుండడంతో రైతులు నష్టానికి అమ్ముకోలేక అయోమయంలో పడ్డారు. రైతులు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాలధర మాత్రం పెంచలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల విక్రయాల తో వచ్చిన డబ్బులు పశుగ్రాసానికి, పశువుల దానాకు సరిపోవడంలేదని రైతులు అంటున్నారు. జిల్లా అధికారులు స్పందించిఆచంట నియోజవర్గంలో పశు గ్రాసం దాన ఉచితంగా సరఫరా చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పాలకొల్లు ఉల్లంపర్రు నుంచి వాడపల్లి పాదయాత్ర

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు మండలం ఉల్లంపర్రు నుండి వాడపల్లి కి, పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తత్వవేత్త, ఉల్లంపర్రు మాంటిసోరిస్ విద్యాసంస్థల నిర్వాహకులు మద్దాల వాసు స్వీయ పర్యవేక్షణలో జరుగుతున్న 12వ పాదయాత్ర ను, ఉల్లంపర్రు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం దగ్గర నుండి ప్రారంభించారు. శుక్రవారం 4 గంటలకు ఎస్.టి.పి.వి రమణ గురుస్వామి, అయ్యప్ప స్వామి దేవస్థానం వ్యవస్థాపకులు బాబులు గురుస్వామి ల చేతుల మీదగా యాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రలో సుమారు 200 మందికి పైగా భక్తులు యాత్రలో పాల్గొంటున్నారని వీరికి మార్గమధ్యంలో అలసట రాకుండా నిమ్మరసం, మజ్జిగ రాగి జావ అందజేస్తారని, ఈ పాదయాత్ర సాయంత్రం పెనుగొండ గ్రామంలో బస చేసి, శనివారం ఉదయం, పెనుగొండ నుండి మొదలవుతుందని శనివారం సాయంత్రం ఆరు గంటలకు వాడపల్లి చేరుకుంటామని మద్దాల వాసు వెల్లడించారు. హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీ ఉల్లంపర్రు లలితా పారాయణ సేవ కమిటీ బృందము, ఆలయ కమిటీ సభ్యులు రావాడ సతీష్, పోతబత్తుల సత్యనారాయణ, గుల్లిపల్లి అచ్యుత రావు, అల్లు శ్రీను, కాటంరెడ్డి దొరబాబు, కటారి నాగేంద్ర పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది...

- జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి వెల్లడి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల కార్యక్రమంలో 29డిసెంబర్ నాటికి జిల్లాలో 954 మ్యాచ్ లు నిర్వహించి రాష్ట్రంలో ఏలూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు.శుక్రవారం ఆగిరిపల్లిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహణ అనంతరం ఆగిరిపల్లిలో నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలను సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తో కలిసి జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించిన ఆడుదాం..ఆంధ్ర క్రీడా ఆటలలో 333 గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో 954 ఆటలు నిర్వహించి ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, దు ఎస్ వో ,మండల ప్రత్యేక అధికారి అర్.ఎస్ ఎస్.రాజు,ఎంపిడిఓ శంకరావు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు,క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పోలంపల్లికి గండి

విశాలాంధ్ర-వత్సవాయి, పెనుగంచిప్రోలు : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వల్లనే పోలంపల్లికి మునేరు ప్రాజెక్ట్‌కు గండి కొట్టే పరిస్థితి ఏర్పడిందని, పోలంపల్లి మునేరు ప్రాజెక్టు ఆధునీకరణ పట్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందనీ, రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలనీ సీపీఐ జిల్లా కార్యదర్శి దొనేపూడి శంకర్, జగ్గయ్యపేట నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు శ్రీరాం తాతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పోలెంపల్లి మునేరు ప్రాజెక్ట్ వద్ద తెలంగాణ రైతులు అక్రమంగా తవ్విన గండిని సీపీఐ, తెలుగు దేశం, జనసేన, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్‌లో కురిసిన వర్షాలకు గండి పడి కొట్టుకుపోయినదనీ, కుడి వైపున ఉన్న తెలంగాణ వైపు పాత ఆనకట్టకు రెండు చోట్ల గండ్లు పడ్డాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పడిపోయిన గోడ నిర్మాణం చేసిందన్నారు. గండ్లు పూర్చుటకు మొదట తెలంగాణ రైతులు అంగీకరించనీ పక్షంలో జగ్గయ్యపేట శాసన సభ్యులు సామినేని ఉదయభాను ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం రైతులకు ఇప్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. ఈనాటి వరకు తెలంగాణ రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందలేదని తెలిపారు. తెలంగాణ రైతులుకు నష్ట పరిహారం చెల్లించకపోవడంతో మంగళవారం తెలంగాణ మునేరు పాత ఆనకట్టకు తెలంగాణ వైపు గండి కొట్టడంతో పాత ఆనకట్ట వద్ద 0.13 టీఎంసీల నిల్వ ఉన్న నీరు వెనుకకు వెళ్లిందన్నారు. రెండు వైపులా 7.5 కి.మీ. దూరం, 75 మీటర్ల ఎత్తు కరకట్టల నిర్మాణం, బ్యారేజ్ నిర్మాణం పూర్తి అయిన యెడల ఆనకట్ట నీటి నిలువ 0.8టీఎంసీలకు పెరుగుతుందని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి గన్‌మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులు, రైతుల మీద ఎంత చిన్న చూపు ఉన్నదో తెలుస్తుందని విమర్శించారు. తక్షణమే గండి పూడ్చి రైతులకు న్యాయం చేయాలని ఆంధ్ర తెలంగాణ రైతుల మధ్య సయోధ్య కుదర్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు సుబ్బారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, సీపీఐ జగ్గయ్య పేట సహాయ కార్యదర్శి బాబురావు, టీడీపీ నాయకులు, వేగినేటి గోపాలకృష్ణ మూర్తి, వాత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు వడ్డెలమూడి రాంబాబు, పెనుగ్రంచి ప్రోలు మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య, పొన్నం నరసింహారావు, వల్లంకొండ బ్రహ్మం, జనసేన నాయకులూ బాడిన మురళి కృష్ణ, జనసేన వీర మహిళా కృష్ణవేణి, మునేటి నీటి సంఘం మాజీ అధ్యక్షులు యార్ల గద్ద విశ్వనాథం, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్'లో ప్రత్యేకతలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ప్రయాణాన్ని వినూత్నమైన పుష్-పుల్ విధానం ప్రయాణీకులకు వేగం, సామర్థ్యం, సౌకర్యవంతంగా చేయటానికి ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని సూపర్‌ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లలో కొత్త కేటగిరీ-అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్-ని జెండా ఊపి ప్రారంభం చేయనున్నారు.అందులోని ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ డివిజన్ మీదుగా వెళ్ళనున్నదని విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రైలు మాల్డా టౌన్ - శ్రీ ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినస్ (బెంగళూరు)కు వెళ్ళుతుందని మన డివిజన్‌లో ఈ రైలు మన డివిజన్‌లో తుని, సామర్లకోట్, రాజ మండ్రి, ఏలూరు, విజయవాడ,తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరులో స్టేషన్లలో ఆగుతుం దన్నారు ఈ రైలు ప్రయాణీకులకు వేగవంతమైన, అనుకూలమైన, సురక్షితమైన అత్యంత సౌకర్యవంత మైన ప్రయాణం అందిస్తుందన్నారు. అమృత్ భారత్ రైలు ప్రత్యేకతలు......దేశంలోని సూపర్ ఫాస్ట్ ప్యాసింజర్ అధునాతనమైన రైళ్లలో ఒకటిగా ఉంటుంది. 22 కోచ్‌లతో కూడిన ఎల్‌హెచ్‌బి పుష్-పుల్ రైలు, వీటిలో 12 నాన్-ఎయిర్ కండిషన్డ్ స్లీపర్ క్లాస్, 8 జనరల్ అన్‌రిజర్వ్ క్లాస్ ఈ రైలు చివర్లలో రెండు లోకోలను కలిగి ఉంటుందన్నారు. ప్రయాణీకులకు సౌందర్య వంతంగా ఆకర్షణీయంగా రూపొందించబడిన సీట్లు, మెరుగైన లగేజీ రాక్, స్నాక్ టేబుల్, తగిన మొబైల్ హోల్డర్‌తో మొబైల్ ఛార్జింగ్ పాయింట్,ఎల్ఈడీ లైట్లు,సీసీటీవిలు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి మెరుగైన సౌకర్యాలు ఉంటాయన్నారు.ఇది ఆహ్లాదకరమైన కలర్ బ్లెండింగ్,ఆటోమేటిక్ పరిశుభ్రత వాసన నియంత్రణ వ్యవస్థతో మెరుగైన లావెటరీని అందిస్తుంది. ఎలక్ట్రికల్ క్యూబికల్‌లో ఏరోసోల్ ఆధారిత అగ్ని మాపక వ్యవస్థ,రేడియం ఇల్యూమినేషన్ ఫ్లోరింగ్ స్ట్రిప్,జెర్క్ ఫ్రీ జర్నీ కోసం జెర్క్ ఫ్రీ కప్లర్,ఒక కోచ్ నుండి మరొక కోచ్‌కు వెళ్లేందుకు వీలుగా విస్తృత గ్యాంగ్‌వేలు ఉంటాయన్నారు. సాధారణ ప్రయాణికు లకు అనువైన ధరలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఏడిఆర్ఎం డి.శ్రీనివాసరావు (మౌలిక సదుపాయాలు), సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు వావిలపల్లి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ నుస్రత్ ఎం మండ్రుప్‌కర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లను, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : అంగన్వాడీ వర్కర్లను, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇచ్చిన హామీలు సైతం నెర వేర్చని ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని, న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేస్తూ తాళ్ళపూడి మండల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు 18 వ రోజు సమ్మెను కొనసాగించారు. పలువురు కార్యకర్త లు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని దుయ్య బట్టారు. ఏ.పి.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పేర్స్ యూనియన్ కార్యకర్తలు ఆయాలు తాళ్ళపూడి మండల ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో దీక్ష కొనసాగించారు. తమ న్యాయమైన కోర్కెలు నెరవేరే దాకా ఉద్యమం కొనసాగు తుందని వారు హెచ్చరించారు.

పబ్లిక్ ప్రదేశాల్లో పుట్టినరోజులు చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల పబ్లిక్ ప్రదేశాలలో పుట్టిన రోజు కేక్ కట్ చేసే చర్య ఒకటి జరిగినట్లుగా అమలాపురంలో కొంత మంది స్థానికులు మా దృష్టిలోనికి తీసుకురావడం జరిగింది. పబ్లిక్ ప్రదేశాల్లో, రోడ్లపై పుట్టినరోజు పేరు చెప్పి, మరో సందర్భం చెప్పి కేకులు కట్ చేయడం, రోడ్లపై న్యూసెన్స్ చేయడం వంటివి చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అమలాపురం డీఎస్పీ ఎం అంబికా ప్రసాద్ తెలిపారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉత్తర్వులు అమలులో ఉన్న విషయాన్ని ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అమలాపురం పరిధిలో ఉన్నటువంటి అమలాపురం పట్టణం, అమలాపురం తాలూకా ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, ఐ పోలవరం మరియు కాట్రేనికోన పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి వారందరికీ వర్తిస్తాయన్నారు.

మద్యం లేని నూతన సంవత్సరాన్ని స్వాగతిద్దాం

విశాలాంధ్ర - పిఠాపురం : జనవిజ్ఞాన వేదిక మరియు మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని మద్యంతో వద్దు. మద్యం లేని నూతన సంవత్సరాన్ని మనసారా స్వాగతిద్దాం అను గోడ పత్రికను ఆవిష్కరించారు. స్థానిక చంటి పిల్లల వైద్యులు పిఎస్ రాజు ఈ గోడ పత్రికను అన్నపూర్ణ తల్లి పిల్లల హాస్పిటల్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి నేమిశెట్టి గంగ బాబు, సామాజికవేత్త వి సత్యనారాయణ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ డిడి కొమ్మనాపల్లి అప్పారావు, ఆర్ఆర్‌బిహెచ్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి కేశవ రావు, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్ సూర్యనారాయణ, వి తరుణ్, గణేష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీలు..నేడు ఎంపీల ఇళ్లు ముట్టడి

విశాలాంధ్ర - కరప : అంగన్వాడీలు గత 17 రోజులుగా సమ్మె చేస్తూ తమ కోర్కెలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమ్మెలో భాగంగా శనివారం ఎంపీల ఇళ్ళను ముట్టడిస్తామని సిఐటియు మండల అధ్యక్షురాలు వరలక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వం మెట్టు దిగే వరకు పోరాటం చేస్తామని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్దాల రాంప్రసాద్, కల్పలత, వీర వేణి, వెంకటలక్ష్మి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చెయ్యండి

విశాలాంధ్ర - కాజులూరు : జిల్లా కేంద్రమైన కాకినాడలో జనవరి 3వ తేదీ బుధ వారం జరుగనున్న సీఎం వైఎస్ జగనెమ్మెహన్‌రెడ్డి సభను విజయవంతం చేసేం దుకు అధికారులు, నాయకులు కృషి చెయ్యాలని పెద్దాపురం డీఎల్డీఓ కెవిన్వి ప్రసాదరావు అన్నారు. కాజులూరు ఎంపీడీఓ కార్యలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ప్రసాదరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. వృద్ధాప్య, వికలాంగ, వితంతు పించన్లు రూ.మూడువేలు పెంపు కార్యక్రమం ప్రారంబించేందుకు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి కాకినాడ వస్తున్నారని మండల గ్రామాల నుంచి సభకు వచ్చే అబిమానులకు, ప్రజలు వసతుల ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాయకులు, అధికారులు కృషి చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నరాజు, ఈఓపీఆర్డి సీహెచ్ ఇందిరాదేవి, డ్వాక్రా ఏపిఎం అనీల్ కుమార్, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవుని అంతరంగాన్ని తాకే హమీద్ దాల్వాయి కథలు

ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): 34వ విజయవాడ పుస్తక మహెూత్సవం శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై ఓల్గా అనువాద రచన 'హమీద్ దల్వాయి కథలు' ఖాదర్ మొహియుద్దీన్ ఆవిష్కరించి మాట్లాడుతూ మరాఠీ రచయిత హమీద్ దల్వాయి 1932 పుట్టి, 77 చనిపోయాడని జీవిత కాలంలో రాజకీయ సామాజిక రంగాలలో రచనా రంగంలో ఉంటూ కవిత్వం ఎక్కడ పోతుంది ఎక్కడ ముగుస్తుందని ఈ రెండు విషయాలపై పుస్తకాలు రాశారన్నారు. మానవుని అంతరంగాన్ని తాకే కథలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్ల వెంకట నారాయణ, సాయి వంశీ, సుస్మిత, పూర్ణిమా తమ్మిరెడ్డి, మీనా తదితరులు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవంలో నేడు

విశాలాంధ్ర-విజయవాడ : 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో మూడవ రోజు శనివారం కార్యక్రమాలు సాయంత్రం 6 గంటలకు విశాలాంధ్ర పబ్లిషర్స్ వారి పుస్తకావిష్కరణ సభ జరుగుతుంది. జనాభా సంఖ్య- అపోహలు - భారత రాజకీయాలు' పుస్తకాన్ని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి వై ఎస్ ఖురేషి ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా మైనారిటీ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎమ్మెల్యే, విశాలాంధ్ర సంపాదకమండలి అధ్యక్షులు కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకమండలి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గద్దం కోటేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు తదితరులు పాల్గొంటారు.